వైద్య విద్యార్థినికి ఆర్థిక సహాయం

వైద్య విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డి, జూన్ 23 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న ఓ విద్యార్థినికి హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న సంజన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆర్థిక సమస్యలు తలెత్తడంతో తన హాస్టల్, పరీక్ష ఫీజు చెల్లించడానికి సహాయం కావాలని కోరగా స్పందించిన తెలంగాణ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ఆదివారం కళాశాలకు వెళ్లి చెక్కు ద్వారా అందించారు. సంజన మాట్లాడుతూ.. హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో తాను కూడా హెల్పింగ్ హ్యాండ్ ద్వారా తన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, కోశాధికారి సంగయ్య, ఉపాధ్యాయులు రాజన్న, రాజయ్య, లింగం, సంతోష్ పాల్గొన్నారు.

సెవెన్ హార్ట్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో 'త్రో సీడ్‌బాల్స్'

సీడ్ బాల్స్‌ను విసురుతున్న సెవెన్ హార్ట్స్ సభ్యులు, ప్రతినిధులు

కామారెడ్డి రూరల్, జూన్ 23 : కామారెడ్డి మండలంలో ప్రముఖ సేవా సంస్థ సెవెన్ హార్ట్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో చిన్నమల్లారెడ్డి గ్రామంలో త్రో సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ఫౌండర్ జీవన్ నాయక్ పాల్గొని వారం రోజుల క్రితం తయారు చేసిన సీడ్ బాల్స్‌ను మైదాన చెరువు గట్టు ప్రాంతంలో వేయడం ద్వారా వర్షం నీటితో మొలకెత్తి పండ్ల చెట్లుగా తయారు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో ప్రతినిధులు పవన్ కళ్యాణ్, మౌనిక, సమీన, పూజా, పూజిత, శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల ఇష్టారాజ్యం!

- అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు
- ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థుల తరలింపు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

దోమకొండ, జూన్ 23: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువులు భారంగా మారాయి. ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. అడ్మిషన్ ఫీజుతోపాటు ఇతరాత్ర ఫీజులంటూ అందినకాడికి దండుకుంటున్నాయి. పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు ఎంతైనా ఖర్చు చేస్తారనే ఒకే ఒక్క బలహీనతను ప్రైవేట్ పాఠశాలల యజమానులు ఆసరాగా తీసుకుంటున్నారు. అంతేగాకుండా యాజమాన్యాల నియంత్రణలోనే యూనిఫామ్‌లు, పుస్తకాలు విక్రయిస్తున్నారు. వారికి అనుబంధంగా బుక్ డిపోలు సమకూర్చుకొని అమ్ముతున్నారనే ఫిర్యాదులూ ఉన్నాయి. వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా.. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలేదు. రవాణా, ఫీజుల విషయంలో యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలతో పని లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం గమనార్హం.

ఆటోలు, వ్యాన్‌లే గతి

ప్రభుత్వ నిబంధనలను కొన్ని ప్రైవేట్ పాఠశాలలు బేఖాతరు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్ నెస్ లేకపోయినా వాటిని యథేచ్ఛగా నడిపిస్తున్నారు. కొన్నిపాఠశాలలు రవాణా సదుపాయం కింద ఆటోలు, ఓమ్నీ వ్యాన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఇది నిబంధనలకు విరుద్ధమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. ఆటో ఎక్కడా ఖాళీ లేకుండా డ్రైవర్ సీటు పక్కన ఒకరు కూర్చునే చోటులో నలుగురు నుంచి ఆరుగురు పిల్లలను కూర్చోబెట్టుకుంటున్నారు. పరిమితికి మించి తరలిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు..

ప్రభుత్వ పాఠశాలలపై విద్యాశాఖాధికారులు దృష్టి సారిస్తున్నారు. గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలను పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల అర్హతలు, ఫీజులు, మౌలిక వసతులను తనిఖీ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖాధికారులను మచ్చికచేసుకొని అడ్డగోలుగా ఫీజులు చేస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించిన ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పుణ్యస్మృతి దివాస్

కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కామారెడ్డి, జూన్ 23 : పట్టణంలోని 18వ వార్డులో ఉన్న ఓం శాంతి కాలనీలో పుణ్యస్మృతి దివస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పాల్గొని మాట్లాడుతూ.. మనిషి తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. మెడిటేషన్ ద్వారా ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు హఫీజ్ బేగ్‌మిర్జా, పాత శివ కృష్ణ మూర్తి, మాజీ కౌన్సిలర్ సుధాకర్, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, జూన్ 23 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

ప్రతిభ చూపిన క్రీడాకారులకు సన్మానం

అర్చరీ క్రీడాకారులకు శాలువాతో సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

దోమకొండ, జూన్ 23 : మండల కేంద్రంలోని గడీకోట ఆధ్వర్యంలో అర్చరీలో శిక్షణ ఇచ్చారు. ఇందులో శిక్షణ పొందుతూ జాతీయ స్థాయిలో ఖేలో ఇండియాలో ప్రతిభ చూపిన కదిరే సింధుజ, అర్చరీ స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన శ్రీధర్‌ను ఆదివారం అర్చరీ కామారెడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, అర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కోచ్ ప్రతాప్‌దాస్, మోహన్‌రెడ్డి, రామచంద్రం, లక్ష్మణ్, అర్చరీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో మోస్తరు వర్షం

ఆనందంలో రైతులు..

బాన్సువాడ, జూన్ 23 : బాన్సువాడ డివిజన్ కేంద్రంలో శనివారం రాత్రి వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలంలో ఇదే భారీ వర్షం కావడంతో రైతులు దుక్కులు దున్నుకుని సాగుకు సిద్ధం అవుతున్నారు. బీర్కూర్, నస్రుల్లాబాద్, దుర్కి తదితర ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి కొల్లూరు వాగులోకి నీరు చేరింది. మరో వైపు నిజాంసాగర్ నుంచి ఆదివారం నీరు వదలడంతో వాగులు, వంకల్లో నీరు చేరుతుండడంతో రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నీటి విడుదలపై రైతుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొల్లూరు వాగులో ప్రవహిస్తున్న నీరు

బంజారా శక్తి మూమెంట్ జిల్లా యువజన అధ్యక్షుడిగా రాంవిలాస్ రాథోడ్

రాంవిలాస్ రాథోడ్

గాంధారి, జూన్ 23: బంజారా శక్తి మూమెంట్ జిల్లా యువజన అధ్యక్షుడిగా గాంధారి మండలం సోమారం తండాకు చెందిన రాంవిలాస్ రాథోడ్ నియమితులయ్యారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం సమావేశమైన బంజారా నాయకులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బంజారా శక్తి మూమెంట్ రాష్ట్ర అధ్యక్షుడు రవినాయక్ ఈమేరకు రాంవిలాస్ రాథోడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాంవిలాస్ రాథోడ్ మాట్లాడుతూ.. బంజారాల సంస్కృతీ సంప్రదాయాలను కాపాడడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు పలువురు బంజారా సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

క్షీరాభిషేకం

ఎల్లారెడ్డి/ గాంధారి/ లింగంపేట , జూన్ 23: రూ.రెండు లక్షల్లోపు వ్యవసాయ రుణాన్ని మాఫీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట మండలం పర్మళ్ల గ్రామాల్లో క్షీరాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు.

చెరువు తూము నిర్మాణం ఎప్పుడు పూర్తయ్యేనో..?

నాగనయ్య చెరువు కింద పంట పొలాల్లోకి చేరిన వర్షపునీరు

నాగిరెడ్డిపేట, జూన్ 23: మరమ్మతులు చేపడుతున్న తూము నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. తాము ఎప్పుడు నారు మళ్లు వేసుకోవాలో అని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని తాండూర్ శివారులో ఉన్న నాగనయ్య చెరువు తూము పనులను ఇరిగేషన్ అధికారులు నెల రోజుల క్రితం ప్రారంభించారు. వానకాలం ప్రారంభమైనా పనులు ఇప్పటివరకు పూర్తికాలేదు. వర్షం కురిస్తే నీరు కుంట కింద ఉన్న పంటపొలాల్లో నిలుస్తున్నది. దీంతో నారుమళ్లు వేసుకోవడానికి వీలులేకుండా పోతున్నదని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి తూము నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ఇబ్బందులను తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కూలిన సైడ్‌వాల్.. ప్రమాదకరంగా వంతెన

నాగిరెడ్డిపేట, జూన్ 23: మండల కేంద్రం నుంచి చీనూర్, వాడి గ్రామాలకు వెళ్లే దారిలో పోచారం ప్రధాన కాలువపై ఉన్న వంతెన సైడ్‌వాల్స్ ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఈ రహదారి మీదుగా చీనూర్, వాడితోపాటు గోలి లింగాల, చీనూర్ కాల్వ కింది కాలనీకి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రి సమయంలో వాహనాలు అదుపుతప్పి కాలువలో పడి వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి వంతెనకు సైడ్‌వాల్స్ లేదా గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోచారం ప్రధాన కాలువపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

డ్రైనేజీని నిర్మించండి సారూ..!

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 23: మండలంలోని తిమ్మారెడ్డి తండాలో డ్రైనేజీని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఇండ్ల ఎదుట నిర్మించిన మురికి కాలువ సగం గ్రామం వరకే ఉన్నదని తెలిపారు. ఊరి చివరి వరకు డ్రైనేజీ లేకపోవడంతో ఇండ్ల ఎదుట మురికినీరు ప్రవహించి ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీని పూర్తిగా నిర్మించాలని స్థానిక నాయకుడు కోల సంతోష్, గ్రామస్తులు కోరుతున్నారు.

తిమ్మారెడ్డి తండా గ్రామంలో సగం వరకు నిర్మించిన మురికి కాలువను చూపిస్తున్న గ్రామస్తులు

నల్ల పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

భక్తిశ్రద్ధలతో నల్లపోచమ్మ పండుగ

మద్నూర్, జూన్ 23: మండలకేంద్రంలో ఆదివారం నల్లపోచమ్మ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారికి నైవేద్యంతోపాటు బోనాలను సమర్పించారు. బాజాభజంత్రీలతో ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లి, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జీవాలను బలిచ్చారు. పాడిపంటలు బాగాపండి, పిల్లాపాపలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. బంధుమిత్రులను ఇంటికి ఆహ్వానించడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొన్నది.

ఘనంగా బలిదాన్ దివస్

కామారెడ్డిలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కామారెడ్డి/ గాంధారి/ లింగంపేట/ డోంగ్లీ/ భిక్కనూరు, జూన్ 23: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బలిదాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని నాయకులు గుర్తు చేసుకున్నారు. కామారెడ్డిలోని బీజేపీ కార్యాలయంతోపాటు భిక్కనూరు, గాంధారి, లింగంపేట, డోంగ్లీలో నిర్వహించిన కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక పూజలు

శక్కర్‌నగర్, జూన్ 23: బోధన్ పట్టణంలోని శ్రీ సంకట విమోచన గణపతి దేవాలయంలో ఈనెల 25న అంగారక చతుర్థశి (సంకటహర చతుర్థశి) మంగళవారం వస్తున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి నెలా సంకటహర చతుర్థశి సందర్భంగా ఆలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసారి మంగళవారం అంగారక చతుర్థశి కావడంతో భక్తులు ఉపవాసాలు స్వీకరించనున్నారు.

వారాంతపు సంతలో దొంగల చేతివాటం

గాంధారి సంతలో ఒకే రోజు ఎనిమిది సెల్‌ఫోన్ల అపహరణ

గాంధారి, జూన్ 23: మండల కేంద్రం గాంధారిలో ఆదివారం నిర్వహించిన వారాంతపు సంతలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఏకంగా ఎనిమిది విలువైన సెల్‌ఫోన్ల అపహరించారు. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారిలో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తారు. ఈ సంతకు గాంధారి మండల ప్రజలతోపాటు బాన్సువాడ, కామారెడ్డి, లింగంపేట, సదాశివనగర్, రామారెడ్డి తదితర మండలాల నుంచి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. దీంతో సంత జనాలతో సందడిగా ఉంటుంది. కాగా.. ఆదివారం జరిగిన సంతలో ఎనిమిది సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ప్రతి ఆదివారం సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయని వాపోతున్నారు. అంగడిలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు.

నృత్య పోటీల్లో కమ్మర్‌పల్లి కళాకారిణుల ప్రతిభ

మోర్తాడ్, జూన్23: తెలంగాణ సారస్వత పరిషత్ వేదికగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారు హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన నృత్య పోటీల్లో కమ్మర్‌పల్లికి చెందిన కళాకారిణులు ప్రతిభ చూపిన ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును కైవసం చేసుకున్నారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారి నుంచి నంది అవార్డులను అందుకున్నారు. ఈ పోటీల్లో శాలినిగౌడ్, శివాని, శ్రీలాస్య, హాసిని, అతిజ్ఞ, పూర్విత, వన్షిక, రిషిత పాల్గొని ప్రతిభ చూపారు. వీరు కమ్మర్‌పల్లిలోని శ్రీపరమేశ్వర నృత్య కళానిలయంలో శిక్షణ పొందుతున్నారు. వీరు అవార్డులను కైవసం చేసుకోవడంతో వీరిని గురువులు గంట శిరీష, రాజశేఖర్‌గౌడ్, గ్రామస్తులు సోమవారం అభినందించారు.

అవార్డులను అందుకుంటున్న కళాకారిణులు

వానలు కురవాలని దేవతా మూర్తులకు జలాభిషేకం

ఏర్గట్ల, జూన్ 23: మండలంలోని బట్టాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవతలకు గంగ నీళ్లతో జలాభిషేకం చేశారు. తడ్‌పాకల్ గోదావరికి వెళ్లి గంగ జలం తీసుకువచ్చి డప్పువాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. దేవతలకు జలాభిషేకం నిర్వహించి పాడి పంటలు బాగుండాలని, ప్రజలు సంతోషంగా ఉండేలా దీవించాలని వేడుకున్నారు. స్థానిక గిరిజన తండావాసులు వారి సంప్రదాయం ప్రకారం సమ్‌నక్ పూజలు నిర్వహించారు. వానలు కురవాలని, పంట లు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
పాస్‌పోర్ట్ పోయినది
నేను VIJAY PAMBALLA, S/o.Rajanarsu Pamballa, H.No.1-81, గ్రా॥ అరెపల్లి, (మం) పల్వంచ,(జి) కామారెడ్డి నా పాస్‌పోర్ట్ నెం. L2244341 కలది. అరెపల్లి నుండి కామారెడ్డికి బైక్ పై వెళ్ళుచుండగా పడిపోయినది. దొరికినవారు సం॥ 7989060887
NTZ-340062
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.